# ** చిలుక పలుకు **

శ్రీ అంగర వెంకట కృష్ణారావుగారు

ప్రకృతిలో యేదైనామార్పు వచ్చిందంటే, ఆ మార్పువల్ల ప్రతిజీవికీను ఒక్కొక్క విధమైన అనుభవం కలుగుతుంది. అది సహజమే.

'జిహ్వకోరుచి పుర్రెకోబుద్ధి' అన్న సామెత వుందికదా! పక్షులలో పక్షులకు, జంతువులలో జంతువులకు, మనుష్యులలో మనుష్యులకు కాలానుసరణంగా వేర్వేరురకములగు అనుభవాలు కలుగుతాయి. మబ్బుగావుండి, చల్లని పిల్లగాలులు మెల్లగావీస్తూవుంటే నెమిలి పురివిప్పి హాయిగా ఆడుతుంది. కాని అది చిలకలు మొదలగు మాజాతికి కిట్టదు. సాదాగా వుంటేనేగాని తోచదు. అంటే అంత ఎండగాని, అంత మబ్బుగాని వుండకుండా అన్నమాట. అప్పుడు మేము బిర్రుబిర్రున ఎగురుతూ క్యారుక్యారున అరుస్తూ చెట్లు అగపడకుండావున్న ఆకులను కప్పిపుచ్చే పువ్వుల సువాసన అనుభవిస్తూ, పళ్లూకాయలుతింటూ ఎంతో ఖులాసాగా వుంటాము. మరి జంతువులసంగతి. ఎవరింట్లోనైనా ఒకరిమాట ఒకరికి పొందకుండా ఒకరు యతియంటే యింకొకరు ప్రతి అన్నరకంలోవుంటే వారినిగురించి లోకులు, 'ఎద్దెండకిలాగ ఎనుబోతు నీడకి లాగ' 'కప్పలతక్కెడ వ్యవహారం' ఇత్యాదు లుపయోగిస్తారు. అంచేత జంతువుల్లో జంతువులకుకూడ కిట్టుబడిలేదన్నమాటే. మూడవది దైవసృష్టికంతటికీ అగ్రస్థానం అధిష్ఠించేమన్న గర్వంతో విర్రవీగుతూన్న మనుష్యులసంగతి. అది అంతకన్నహీనం. ఒకవుబ్బసమనిషి, ఒక సాధారణుడువున్నారంటే వాతావరణవిషయమై వీరిద్దరికీ భేదం వచ్చిందన్నమాటే. మొదటిఆసామి మాజాతివాడు. రెండవఆయన నెమిలి. ఇలాగుంటుంది ప్రపంచధర్మం.

మా తలిదండ్రు లెలాగుండేవారో, వారిఆకారం, అదీ మరిచిపోయాను. కాని ఒకటిమాత్రం ఆజన్మాంతం మరువలేను. ఏమిటి? నాపైనా తల్లికివుండేడి అంతులేనిప్రేమ. అప్పటిదాకా నాకు బాగా రెక్కలు రాలేదు. అలాగే మాగూట్లో వెచ్చపరుంటే, వేళ అయ్యేసరికల్లా మాఅమ్మ ఎక్కడనుంచో ఒక జామిపండో, ఒక కొబ్బరికురిడీముక్కో మరేదో తెచ్చి ఎంతో ఆపేక్షతో నాకిచ్చేది. అల్లంతదూరంనించే మాఅమ్మను నేనుచూచి అత్యానందంతో ఆవొచ్చీరానీ రెక్కలు టపటపకొడుతూ ఆమె నెంతో సంతోషింపచేసేదాన్ని. అప్పుడు మాఅమ్మ "బిడ్డా! నేనింట్లో లేనప్పుడు ఎక్కడికీవెళ్లబోకు. కిందపడిపోతే ఎంతో ప్రమాదం. రెక్కలువచ్చాక ఎలా ఎగరడమో చెప్తా. నువ్వులేకపోతే నాకీ జీవితంఎందుకు? అన్నలూఅక్కలూ ఎవరిదారి వారు చూసుకున్నారు. మీతండ్రి లోకాంతరం వెళ్లిపోయినారు. మరి యీ ప్రపంచంలో అన్నీ నీవే నాకు" అనేది. అది వినేసరికి నాకు వొళ్లు పులకరించేది. సంతోషంపొంగి జాగాలేక పడిపోతున్నానో అన్నట్లు రెండు ఆనంద బాష్పాలు రాల్చేదాన్ని. మానాన్నపోయారంటే నాకంతకష్టం అని పించలేదు. ఏమంటే ఆయన ఎలాగుండేవారో, పైగా తండ్రితోవుంటే ఎలాగుంటుందో ఆసౌఖ్యం అనుభవించలేదు; ఒక వేళ అనుభవించినా నాకు తెలీదు.

ఆ వేళ చాలా మబ్బుగావుంది. వేళ తెలీడంలేదు. మాఅమ్మ ఎక్కడున్నాదో తెలీదు. ఎంతకీ రావడం లేదు. ఎంతవేళ తెలీకపోయినా ఆకలి తెలీదు? కడుపు మాడిపోతున్నాది. పోనీ పైకిపోయి చూదామంటే మాఅమ్మ "రెక్కలురాలేదు. పైకిమాత్రం రాకు ప్రమాదం" అన్నమాటలు జ్ఞాపకానికొచ్చాయి. అంచేత అలాగేపడుకుని ఏడుస్తున్నాను. అమ్మా! అమ్మా! అని. నజ్జుగావుంది వంట్లో. ఎదురుగుండా నెమిలిపోటి నాట్యంచేస్తూంది. దానికేంభయం? దాని పొట్ట అది పోషించుకోగలదు. నాకో, అమ్మతెస్తే

కద్దు లేకపోతేలేదు. దాని నాట్యం దానిహాయి చూస్తే నాకు అసహ్యాం, అసూయ కలిగాయి. మా అమ్మ రాలేదని అసలే ఏడుస్తూవుంటే దాని ఆటే మిటి? ఒకరు ఏడుస్తూవుంటే ఒకరు నవ్వు! ఆహా! ఎంత సేపైనా చీకటిని చీల్చేసూర్యుడు రాలేదు. నాఆకలి రూపుమాపే అమ్మకూడా రాలేదు. చాలా మబ్బుగావుంది. కారు చీకటిలాగుంది. చల్లగాలి వేసింది. అది ఝంఝూమారుతంగా మారింది. నా గూడు తెగిపోయిన గాలిపటంలాగ దారితప్పి తహతహలాడే నావలాగ కొట్టుకుంటున్నాది. నాకు చెప్పరాని భయం వేసింది. ఆమీద చిటచిట చినుకులు పడ్డాయి. అది భోరుమను తుపానుగా మారింది. కడవలతో గుమ్మరించినట్లుపడ్డాది వాన. దేవుని దయ వల్ల నాగూడు మాత్రం నిరపాయంగావుంది. అంత వరకు అదృష్టవంతురాలనే. బెదిరిపోయి ప్రాణములు పిడికిట పెట్టుకుని ఒకమూల నక్కిపోయాను. హోరుని మించిపోయేటట్టు అరుస్తూ వర్షపునీరుని మించిపోయేటట్టు కన్నీరుకారుస్తూ అలాగేపరుండిపోయాను. ఇంతలో గూడులోనికి ఎవరోవచ్చినట్టయింది. అద్దీ! మాఅమ్మ వచ్చింది అని చెంగున గంతువేసాను. నాఆశ నిరాశగా మారింది. ఆ వచ్చినది మాతల్లిగాదు. నా స్నేహితురాలు. ఆమెను గాలిలో, ఆవానలో, ఆ చీకటిలో నన్ను వెతుక్కుంటూ వచ్చింది పాపం. ఆవిడని "ఏమమ్మా మాఅమ్మ అగుపడిందా? వేళ ఎంతవుంటుంది" అని జాలిగా అడిగాను. ఆమె కళ్లంట నీరుకారుస్తూ, "అయిదయింది?" అని చెప్పింది. మాఅమ్మ సంగతి ఎన్నిసార్లడిగినా చెప్పడానికి ప్రయత్నించి చెప్పలేకపోయింది. అంతకంతకు నా కాందోళన అనుమానం లావైపోయాయి. ఎంత ఘోరమైనవార్త వినవలసివస్తుందో! అని భయపడుతూవున్నప్పటికి వేగం తెలుసుకోవాలన్న వుద్దేశంతో ఆమెను పదేపదే అడిగాను. తుదకు ఆమె "ఏంజెప్పను? మీఅమ్మ నీకు ఆహారం తేవడం కోసం రోజూ వెళుతూవున్న సంగతి నీకు తెలుసును కదా? ఇవాళ తిరిగితిరిగి గాలి జోరువల్ల ఎగరలేక అలిసి ఒకచెట్టుకొమ్మమీద కూచున్నాది. అక్కడికి రెండవ యమునివలె ఒక వేటకాడువచ్చి నీతల్లి ప్రక్కనున్న పావురమును చంపే నిమిత్తమై ఒక ఒకవుండ విడిచిపెట్టెను. అది నేను ఒకపొదరింట్లోంచి కనిపెడుతున్నాను. నాకు ముచ్చెమటలు పోసి పోయాయి. కళ్లుగిఱ్ఱునతిరిగాయి. భయంతో "అయ్యో! చచ్చిపోయావు. పారిపో" అనేసరికి మీ అమ్మ నావేపుతిరిగి గ్రహించి ఎగరబోయింది. కాని చూస్తూవుండగా వొళ్లంతా రక్తమయమైంది. పావురమును తగలవలసిన దెబ్బ మీ అమ్మకు తగిలింది. మీ అమ్మక్రింద పడిపోయింది. కపోతము ఎగిరిపోయినది" అని చెప్పింది. ఆమాటలు పూర్తిగావిన్నానో లేదో కాని వొళ్లంతా అగ్నిలో పడ్డట్టుమండింది. కళ్లు తిరిగాయి. చెప్పరానంత తలనొప్పివచ్చింది. మూర్ఛ వచ్చింది. ఆకలిబాధకు మాతృహీనతకలిసి అగ్నిమీద నేయి పోసినట్లైంది.

కొంతసేపయ్యేసరికి కళ్లా మొహానికి చల్లగా ఏదో తగిలింది. తెలివివొచ్చింది. కళ్లు విప్పిచూస్తే నే నొక పెద్దయింట్లో కారాగృహంలో పడివున్నాను. దాని చుట్టూ పిల్లలు చాలామంది ఆడుకుంటున్నారు. అందులో ఒక అబ్బాయి నా కుపచారాలు చేస్తున్నాడు. నేనులేచి కళ్లువిప్పగానే అతడు లోపలికి వెళ్లి ఏదో ఒక మధురమైన పండు తెచ్చాడు. అది చూడగానే నాకు ఆకలి మరింత హెచ్చింది. అతడు అది యిప్పడమే తడవుగా వొక పిసరేనా మిగలకుండా అంతా భక్షించాను. ఆకలిచేత తిన్నాను గాని లేకపోతే అది తినేసమయమా! మాఅమ్మ చనిపోయాక యింకా తిండి!

ఇలాగు కొంతకాలమయ్యేసరికి శేషుకి నాకు మంచి స్నేహం కలిగింది. నే నానాడు మూర్ఛచేత క్రిందపడిపోతే తాను తెచ్చానని తన తండ్రితో చెప్తూంటే విన్నాను. వయస్సుచేత చిన్నవాడైనా బుద్ధిమంతుడు కావడంచేత అతనిని మెచ్చుకోవాలి. ఒకనాడు శేషు బడికి తొందరగా వెళ్లిపోతున్నాడు.